పంట మార్పిడిపై దృష్టి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి
- సీఎం రేవంత్‌రెడ్డి 'రైతు నేస్తం' వీక్షించిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా అన్ని రైతువేదికల్లో ప్రసారం



నాగవరంలో రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించి ఆధునిక వ్యవసాయంతో లాభాలు గడించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రి వర్గంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల రైతులతో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ముఖాముఖి నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి, వ్యవసాయాధికారులు, రైతులు కలిసి నాగవరం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యవసాయ రంగంపై రైతులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కంప్యూటర్ మీట నొక్కి రైతు భరోసా నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు సోలార్ ద్వారా పంపు సెట్లు నడిచే విధంగా ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం తరఫున సబ్సిడీలు అందిస్తామన్నారు.

పప్పు, నూనె గింజల సాగు పెంచాలి

ప్రజలకు నిత్యం అవసరమయ్యే కూరగాయలు, పప్పు ధాన్యాలు, పామాయిల్ సాగు వంటి పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ జిల్లాలోని రెండు ఎకరాలలోపు భూమి ఉన్న1,34,537 మంది రైతులకు రూ. 95.53 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. మిగిలిన రైతులకు రోజుకు కొంత మంది చొప్పున 9 రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్ నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ పి. శ్రీనివాస్‌గౌడ్, హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అమరచింత: రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తుందని ఏఓ అరవింద్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లి, నందిమళ్ల క్యాంపులోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు మల్లేష్, నందకిషోర్, శివకుమార్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు దొందాయిపల్లి, మల్లాయిపల్లి గ్రామాల రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించినట్లు ఏడీఏ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఏఈఓలు అఖిల, షర్మిలాదేవి, వెంకటేష్, నరేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లబ్ధిదారుల జాబితాపై విచారణ చేపట్టాలి



వనపర్తి విద్యావిభాగం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పలుమార్లు జాబితాను మారుస్తూ, ఆఖరిగా పేదల పేర్లు తొలగించి నాయకుల బంధువులు, ధనవంతులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిర్లక్ష్యంగా వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గొనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, మాజీ కౌన్సిలర్ కొండన్న, గద్దంమీది గోపాల్, శాంతన్న, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం



అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ కోరారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో మురుగు కాల్వల శుభ్రత, పాతటొట్టెల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించుట, బ్లీచింగ్ చల్లడం వంటి పనులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మురుగు నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



పాన్‌గల్: మండలంలోని భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రేమద్దులలో 25, కదిరెపాడులో 11 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి 85, పెద్దగూడెంలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి రైతుల నుంచి 28 దరఖాస్తులు స్వీకరించారు.

❖ పెబ్బేరు మండలంలోని తిప్పాయిపల్లి తహసీల్దార్ మురళిగౌడ్ 6, ఈర్లదిన్నెలో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 10 దరఖాస్తులు స్వీకరించారు. శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2, 3 సెంటర్‌లో డిప్యూటీ తహసీల్దార్ అనురాధ భూ సమస్యలపై 14 దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు మధు, వెంకటేష్, రాధాకృష్ణ, రాఘవేంద్రరావు, జ్యోతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: అజాగ్రత్తగా బైక్ నడుపుతూ మరో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న వీపనగండ్ల మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన మంగదొడ్డి సాయిరాం తన బైక్‌పై భార్య వరలక్ష్మి, కుమార్తె సాన్విక‌తో కలిసి వనపర్తి నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. వారు మండలంలోని దావాజిపల్లితండా సమీపంలో వస్తుండగా ఫోన్ మాట్లాడుకుంటూ అతివేగంగా బైక్‌పై నడుపుతున్న వ్యక్తి సాయిరాం బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సాయిరాం రెండు చేతులకు, వరలక్ష్మి రెండు మోచేతులకు, సాన్వికకు నుదిటిపై, రెండు మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాధితుడు సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిగిలిన రైతులకు రుణమాఫీ చేయాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

వనపర్తి రూరల్: వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా చెల్లించడంతో పాటు మిగిలిన రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కార్యదర్శి పరమేశ్వరాచారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించి 50 శాతం మంది రైతులకు మాఫీ చేసి మొత్తం పూర్తి చేశామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. మిగతా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు వెంటనే బోనస్ చెల్లించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు వాటికి పరిష్కారం చూపాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కౌంటర్ ఏర్పాటు చేసి నిరంతరం భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్, కురుమయ్య, రాబర్ట్, మద్దిలేటి, కృష్ణయ్య, వెంకటయ్య, రాముడు, రాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, పక్కన ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్‌సెంటర్ పరిధిలో వైద్య బృందం, ఎన్‌జీఓ టీం సభ్యుల సహకారంతో డయాబెటిస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయవ్యాధి నిర్ధారణకు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటిస్ బీ మొదలగు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, ఎమ్ఎల్‌హెచ్‌పీ వైద్యులు తారాశశాంక్, దిశ జిల్లా క్లినిక్ సర్వీస్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, ఎన్‌జీఓ టీమ్ శివాణి, హెచ్ఐవీ టీమ్ బంగారయ్య, క్షయ వ్యాధి బృందం కోఆర్డినేటర్ వినోద్, రేడియోగ్రాఫర్ లక్ష్మీనారాయణ ఎక్స్‌రే టెక్నీషియన్ ఖాజా, వైద్య సిబ్బంది శాంతమ్మ, నర్సమ్మ, నాగేశ్వరి, సతీష్‌కుమార్, ఆశా కార్యకర్తలు అలివేలు, సరస్వతి, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టుతండాకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశానుసారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, హౌజింగ్ ఏఈ, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదోడి సొంతింటి కలను నిజం చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించాలని, రాని వారికి తొందర్లోనే ఇళ్లు మంజూరయ్యేలా ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవ తీసుకుంటున్నారని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రఘుప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రీతిసుధ, ఎన్.సునీల్‌నాయక్, శంకర్ నాయక్, కిషన్, శ్రీను, బాలు, సురేష్ ఉన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో ఎంతో మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని తహసీల్దార్ సుగుణ అన్నారు. సోమవారం ఖిల్లాఘనపురం, ఆగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ముహూర్తం చేసి ముగ్గు పోశారు. మండల కేంద్రంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ ఖిల్లాఘనపురం గ్రామానికే 56 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. సోమవారం 14 ఇళ్లకు ముగ్గు పోసినట్లు వెల్లడించారు. ఆగారంలోనూ పంచాయతీ కార్యదర్శి గ్రామ పెద్దలతో కలిసి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ, రవికుమార్, ఆగారం ప్రకాష్, క్యామ రాజు, గంజాయి రమేష్, జయకర్, బాలయ్య, గోనెల శంకర్, రాములు, బాబు, యాదగిరి, భద్రయ్య, శ్యాంసుందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన

ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులకు సోమవారం అవగాహన కల్పించారు. ఖిల్లాఘనపురం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సందీప్ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ యాప్‌లో నమోదు వివరాలను డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం వరిసాగుకే ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: వానాకాలంలో వరి పండించే రైతులు సన్నరకం వడ్లు మాత్రమే సాగు చేసేలా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. ఈ యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా వనపర్తి జిల్లాలో వరి కొనుగోలు చేశామని వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ, డీఆర్‌డీఓ పీడీ, మార్కెటింగ్ కోఆపరేటివ్ అధికారులతో వరి కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మునుపెన్నడు లేని విధంగా ఈ యాసంగిలో 43,319 మంది రైతుల నుంచి గరిష్టంగా 2.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. అన్నదాతలకు రూ.554 కోట్లు చెల్లించామని తెలిపారు. ఇందులో పాలుపంచుకున్న అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రవాణా కాంట్రాక్టర్లను ఆయన అభినందించారు. ఈసారి కొనుగోలు విషయంలో ఎదురైన సమస్యలను రాబోయే రోజుల్లో పునరావతం కాకుండా ఇప్పటి నుంచే వచ్చే సీజన్‌కు సమాయత్తం కావాలని సూచించారు. ముఖ్యంగా కొనుగోలు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొనుగోలు కేంద్రాలను గుర్తించి వాటి స్థానంలో ఇతరులను నియమించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు, రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాకు అవసరమైన మేరకు ప్యాడీ క్లీనర్లు కొనుగోలు చేసి సిద్ధంగా పెట్టాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. ప్యాడీ క్లీనర్లు పెట్టిన చోట రైతుల నుంచి క్వింటాల్‌కు ఒక కిలో కూడా తరుగు తీయలేదని, ఈ విషయాన్ని రైతులకు అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలు

జిల్లాలో రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించాలని, ఒకవేళ వరి సాగు చేస్తామంటే సన్నాలు విత్తుకునేలా చూడాలన్నారు. 2023–24 తో పాటు యాసంగి ధాన్యం మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అందించే విధంగా మిల్లర్లపై వత్తిడి తీసుకురావాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. పెండింగ్ బకాయిలు జూలై చివరి వరకు పూర్తి చేసే విధంగా చూడాలని, అదేవిధంగా ఇప్పుడు ఇచ్చిన ధాన్యాన్ని రాత్రి, పగలు మిల్లింగ్ చేసి సకాలంలో ధాన్యం అప్పగించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ పీడీ ఉమాదేవి, కోఆపరేటివ్ అధికారి బి.రాణి, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, సివిల్ సప్లై అధికారి డీఎం జగన్మోహన్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం



వనపర్తి విద్యావిభాగం: జిల్లాలోని 12 ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని కోరుతూ కళాశాల లెక్చరర్లు ఊరూరా ప్రచారం నిర్వహిస్తున్నారని డీఐఈవో ఎర్ర అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతుల గురించి వివరించారు. వనపర్తి పట్టణంతో పాటు గోపాల్‌పేట, ఖిల్లాఘనపురం, కొత్తకోట, పెద్దమందడి, పానగల్, పెబ్బేర్, వీపనగండ్ల, శ్రీరంగాపూర్ మండలాల్లో అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాల్లో మెరుగైన విద్య

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాల్లో వసతులతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు కళాశాలలకు కాకుండా ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని అధ్యాపకుడు ఏకే కురుమూర్తి కోరారు. మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని అభ్యర్థించారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరమశివుడికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కనిమెట్ట ప్రాథమిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కొత్తకోట: మండలంలోని సత్యహళ్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను పంపిణీ చేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన పోతురాజు జానమ్మ సేవా ట్రస్ట్ వారి కుమారులు మహేష్, శివన్న రూ.5 వేలు వెచ్చించి విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, వాటర్ బాటిళ్లు అందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మాణిక్యమ్మ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్ ప్రాథమిక పాఠశాలతో విద్యార్థులకు సోమవారం అక్షరాభ్యాసం చేయించినట్లు ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు.

కనిమెట్టలో..

కొత్తకోట మండలంలోని కనిమెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేసి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని బండపల్లి, తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శ్రీనివాసులు సందర్శించి నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ఇప్పటి వరకు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయిన తర్వాత 341 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో యూపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎం రామచంద్రయ్య ఆధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వసతులు గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసులు, పాఠశాల చైర్‌పర్సన్ మాధవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



తాటిపాములలో..



తెల్లరాళ్లపల్లిలో..



సత్యహళ్లి ప్రాథమిక పాఠశాలలో..

పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా విద్యుత్ తీగ



స్టే వైర్ పక్కనే చేతులను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ స్టే వైర్ ప్రమాదకరంగా మారింది. పాఠశాల ప్రహరీ గోడ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి సంబంధించిన విద్యుత్ స్టే వైర్ పాఠశాల ఆవరణలో చేతులు శుభ్రం చేసుకునే కుళాయిల మధ్యలో బిగించడంతో ప్రతి నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు నీటి కుళాయిల మధ్యలో స్టే వైర్ ఉండటంతో విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్టే వైర్‌ను తొలగించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా పాఠశాల ఆవరణ ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న స్టే వైర్‌ను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

జర్నలిస్టుల వాహనాలకు స్టిక్కర్లు ఇవ్వాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

వనపర్తి రూరల్: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వాలని సోమవారం ప్రెస్ కమిటీ సభ్యులు ఎస్పీ రావుల గిరిధర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు పోలీసులు విధిస్తున్న జరిమానాలతో ఆర్థికంగా చితికిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికా సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల కవరేజ్ చేయడానికి హడావిడిగా వెళ్తున్న సందర్భాల్లో విధుల్లో ఉన్న పోలీసులు జర్నలిస్టుల వాహనాలకు జరిమానాలు వేస్తున్నారని వాపోయారు. స్పందించిన ఎస్పీ త్వరలోనే జర్నలిస్టుల వాహనాల కోసం ప్రత్యేకంగా ప్రెస్ స్టిక్కర్లు తయారు చేసి అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రనమంలో ప్రెస్ కమిటీ సభ్యులు బోలెమోని రమేష్, బొడ్డుపల్లి లక్ష్మణ్, యాదిరెడ్డి, కుమార్, శేఖర్‌యాదవ్, శ్రీనాథ్, తిరుపతి, పురుషోత్తం, ప్రవీణ్, గోపాలకృష్ణ, గట్టు శేఖర్, ముంత రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడిన చెట్లు

కొత్తకోట: మండలంలోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టించా యి. రహదారులు అంతా జలమయమయ్యా యి. సోమవారం ఈదురు గాలులకు భారీ వృక్షాలు రోడ్లపై విరిగి పడడంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

